క్లుప్తంగా

నేత్ర దానంతో మరొకరి జీవితంలో వెలుగు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అద్దాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: కంటిచూపు లేనివారికి నేత్ర దానం చేస్తే వారి జీవితంలో వెలుగు నింపిన ట్టేనని వైద్యుడు అద్దాల సత్యనారాయణ అన్నారు. నేత్రదానానికి వయసు తారతమ్యం లేదని, ఏ వయసు వారైనా దానం చేయవచ్చని చెప్పారు. ప్రపంచ నేత్ర దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు., శరీరంలో కొన్ని అవయవాలు లేకపోయినా గడపవచ్చని, కానీ కంటిచూపు లేకపోతే మాత్రం జీవితం దుర్భరంగా ఉంటుందన్నారు. మరణించిన ఆరు గంటల్లోపు నేత్ర దానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం ఇక్కడ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ,18 ఏళ్ల పైబడిన యువతీ యువకులు అర్హులని చెప్పారు. జూలై 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని పోస్టల్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

అభినందన సందేశాలు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అభిమాన నాయకులకు అభినందనలు తెలియజేయడానికి పోస్టల్ శాఖ వినూత్న కార్యక్రమం చేపట్టిందని సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. పోస్టల్ కార్యాలయంలో కేవలం రూ.10తో శుభాకాంక్షలు తెలియజేయవచ్చని చెప్పారు. పంపిన సందేశాలు నేరుగా అభిమాన నేతలకు చేరుతాయన్నారు.

బీజేపీ నేతల సంబరాలు

బోట్‌క్లబ్: ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంపై బీజేపీ కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు చేశారు. స్థానిక డెయిరీ ఫారం సెంటర్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను పట్టించుకోరా!?



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో చెత్తాచెదారంతో ఉన్న డ్రైనేజీ

బోట్‌క్లబ్: రెండు వారాలుగా డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులోని రహదారులకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు, రోడ్డుపై వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీ శుభ్రం చేయాలని స్థానికులు సంబంధిత మొరపెట్టుకుంటున్నా శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, డ్రైనేజీని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వాహన డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న క్లాప్ వాహన డ్రైవర్లు

కాకినాడ: రెండు నెలల జీతాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ క్లాప్ వాహన డ్రైవర్లు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగరాధ్యక్షుడు పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్లకు సకాలంలో జీతాలందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టు నిర్వహిస్తున్న స్వయంభూ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం కూడా జీతాల విడుదలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల విడుదల విషయంలో పురపరిపాలన శాఖాధికారి తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, దుర్గాప్రసాద్, రాజేష్, భద్ర, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటకు నిప్పు.. కానరాని కనువిప్పు

- పొల్లాల్లో వ్యర్థాలకు మంట పెడుతున్న రైతులు
- లాభం కన్నా నష్టమే ఎక్కువంటున్న అధికారులు
- వాతావరణ కాలుష్యంతో పాటు, పచ్చదనమూ కనుమరుగు
- కుళ్లబెడితే సేంద్రియ ఎరువు అవుతుందని సూచన



కోతల అనంతరం గడ్డిని కాల్చివేసిన వరి పొలం

కాకినాడ సిటీ: వరి కోతలు పూర్తయ్యాక పంట పొలాలకు రైతులు నిప్పు పెడుతుండడం సర్వత్రా ఆందోళన కలిస్తోంది. ఇవి ఒక్కోసారి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. మెషీన్ల పుణ్యమా అని వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెడుతుండడం.. పరిసర రైతులకు శాపంగా పరిణమిస్తోంది. ఓ పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో, నిల్వ చేసిన ధాన్యం రాశులకు ఎక్కడ అంటుకుంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను నీటితో తడపాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

తరచూ ప్రమాదాలు

నిన్నమొన్నటి వరకూ వేసవి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదయ్యాయి. పొలాల్లో గడ్డి వాములు కాలిపోయే పరిస్థితులూ నెలకొన్నాయి. ప్రస్తుతం పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో 1.47 లక్షల ఎకరాల్లో పంట పండించగా, కోతలు పూర్తయ్యాయి. చేలల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారు. భారీగా పొగ ఆవరించి, ఆ వేడికి స్థానిక నివాసాల వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గడ్డికి నిప్పు పెడుతుండడంతో పరిసర గ్రామాల్లో భరించలేని వేడి వస్తోంది.

పచ్చదనం కనుమరుగు

కొందరి అనాలోచిత చర్యలతో రహదారి పక్కనున్న మొక్కలూ దగ్ధమవుతున్నాయి. పొల్లాలోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ఏటా మొక్కలు నాటుతున్నా, సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరి కొన్ని మొక్కలు కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

> **మిత్ర పురుగులూ నాశనం**
>
> 
>
> పంట పొలాల్లో కోతల అనంతరం వ్యర్థాలను తగులబెట్టడం వల్ల అపకారం తలపెట్టే సూక్ష్మజీవులతో పాటు, మేలు చేసే మిత్ర పురుగులూ నాశనం అవుతాయి. దీనివల్ల మేలు కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుంది. కోతలు కోసిన తర్వాత గడ్డిని వెదజల్లి, నీరు పెట్టడం వల్ల గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. రైతులు పొలాల్లో ఎంతమాత్రం గడ్డిని తగలబెట్టవద్దు.
>
> – ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

ఎన్‌జీటీ మార్గదర్శకాల అమలు

- కమిషనర్ వెంకటరావు వెల్లడి
- పారిశుధ్య విభాగం నిర్వహణ తనిఖీ



పారిశుధ్య పనులపై సమీక్షిస్తున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించి, పారిశుధ్య విభాగం ద్వారా జరుగుతున్న వివిధ పనులను పర్యవేక్షించారు. సాలిడ్‌వేస్ట్, లిక్విడ్ వేస్ట్, డంపింగ్ యార్డులను సందర్శించారు. నగరంలో సేకరించిన చెత్తను తరలించే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపించిన తరుణంలో అక్కడ ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించి, అధికారులకు సూచనలు ఇచ్చారు. వాహనాలు సులభంగా లోపలకు వెళ్లేలా తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు ఇచ్చారు. అనంతరం వెహికల్ యార్డును కూడా సందర్శించారు. లగతి వేస్ట్ ప్రోసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు మందకొడిగా సాగడంపై ఆరా తీసి, పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త నిర్వహణ విషయంలో మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను మరింత పటిష్టంగా అమలు చేసేలా అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలు కూడా తగిన సహకారం అందించి, తడి పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి అందజేయాలని కోరారు. ఆయన వెంట ఈఈ మాధవి, డీఈ లోవరాజు, పారిశుధ్య విభాగం అధికారులు ఉన్నారు.

సీఎం ప్రమాణ స్వీకార వీక్షణకు స్క్రీన్ల ఏర్పాటు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల 12న ప్రజలు వీక్షించేందుకు వీలుగా నగరంలోని పలు ప్రాంతాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఈ అంశంపై ఆయన సోమవారం అధికారులతో చర్చించారు. స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ కాకినాడలోని రాగిరెడ్డి కళాక్షేత్రం, స్మార్ట్ సిటీ కార్యాలయంతో పాటు, అన్ని ప్రాంతాల ప్రజలు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు వీలుగా 14 డివిజన్లలో ఉన్న కమ్యూనిటీ హాళ్లలో స్క్రీన్లు, టీవీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే భానుగుడి జంక్షన్, రాజా ట్యాంక్ ఆవరణలోని ఎల్‌ఈడీల ద్వారా కూడా ప్రసారం చేస్తామన్నారు. ఎస్‌ఈ పి.సత్యకుమార్, స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవస్థానం భూములకు కౌలు వేలం

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు సీతారామ స్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ జి.అశ్విని సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు చేబ్రోలు సీతారామస్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర వెంకట దివాకర్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కాకినాడ గోశాలకు పశుగ్రాసం



హుస్సేన్‌పురం నుంచి గడ్డిని వాహనంలో తరలిస్తున్న యువకులు



కాకినాడ గోశాలలో పశువులకు గడ్డి వేస్తూ..

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన యువకులు కాకినాడ గోశాలకు పశుగ్రాసం సరఫరా చేశారు. గోశాలలో పశువులకు పచ్చగడ్డి కొరత ఏర్పడడంతో, గోశాల నిర్వాహకులు హుస్సేన్‌పురం గ్రామంలోని యువకులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పొలంలో పచ్చగడ్డి కోసి, ఆ యువకులు కాకినాడలోని గోశాలకు తరలించారు. గ్రామానికి చెందిన చల్లా బుజ్జిబాబు ఆధ్వర్యంలో యువకులు గడ్డి కోసి వాహనంపై తీసుకువెళ్లి, గోశాలలోని పశువులకు వేశారు.

సుబ్బారెడ్డి సాగర్‌లో అడుగంటిన జలాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ఈ ఏడాది భారీగా నమోదైన ఉష్ణోగ్రతలకు అడుగంటింది. గతేడాది వర్షపాతం తక్కువగా నమోదవ్వడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండలేదు. ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గాయి. దానికి తోడు ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్టులో జలాలు అడుగంటాయి. ఏటా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరేది. దీంతో ప్రాజెక్టు నిండుకుండను తలపించేది. కాగా ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోతే ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేటకు వేళాయె..

- ఈ నెల 14 నుంచి సముద్రంలో చేపల వేట ప్రారంభం
- సిద్ధమవుతున్న మత్స్యకారులు
- కడలి వద్దకు చేరుతున్న బోట్లు
- మండలంలో 8,000 మత్స్యకార కుటుంబాలు



సురక్షిత ప్రాంతాల నుంచి వేట కోసం సముద్ర తీరానికి చేరుకున్న బోట్లు

కొత్తపల్లి: సముద్రంలో చేపల వేటకు సమయం ఆసన్నమైంది. కడలిలో వేట నిషేధ సమయం ఈ నెల 13తో ముగుస్తోంది. 14వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపల వేట ప్రారంభం కానుంది. కాగా మత్స్యకారులు నాలుగు రోజుల ముందు నుంచే చేపల వేటకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ విశ్రాంతి తీసుకున్న బోట్లు చేపల వేట కోసం సాగర తీరానికి చేరాయి. సుమారు రెండు నెలల పాటు ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు కడలి ఒడిలో చేరనున్నారు.

మండలంలో 1,100 బోట్లు

కొత్తపల్లి మండలంలో మత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. మండలంలో సుమారు 1,100 బోట్లపై ఆధారపడి 8,000 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వేట నిషేధం కారణంగా సుమారు రెండు నెలల పాటు సాగర తీరం బోసి పోయింది. ప్రస్తుతం వేట నిషేధ సమయం ముగుస్తుండటంతో తీరం మత్స్యకారులతో సందడిగా మారనుంది. దూర ప్రాంతాలకు వెళ్లి వేట సాగించే మత్స్యకారులు అన్ని సౌకర్యాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే బోట్లను సాగరంలో లంగరు వేశారు. వేట నిషేధం ముగిసిన మరుక్షణం చేపల వేటకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. కొందరు ముహూర్తాలు చూసుకుని వేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

తీరంలో సందడి

మరో రెండు రోజుల్లో సముద్రంలో వేట నిషేధం ముగియనుండగా, సోమవారం నుంచే సాగర తీరంలో సందడి ప్రారంభమైంది. 45 రోజుల విరామం అనంతరం సముద్రంపై చేపల వేట గురువారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. సముద్రంలో మత్స్యసంపదను పెంచేందుకు ప్రభుత్వం 45 రోజుల పాటు వేటను నిషేధించింది. తెరచాప తెప్పలు మినహా మిగిలిన అన్ని బోట్లపై నిషేధం విధించారు. దీంతో గత 45 రోజులుగా మత్స్యకారులు జీవనోపాధికి దూరమయ్యారు. గతంలో నిషేధాన్ని ఉల్లంఘిస్తూ అక్కడక్కడా కొందరు మత్స్యకారులు అడపాదడపా చేపల వేట సాగించడం, వారిపై అధికారులు దాడిచేసి అపరాధ రుసుము వసూలు చేయడం జరిగాయి. కానీ ఈ ఏడాది చేపల వేట నిషేధాన్ని మత్స్యకారులు స్వచ్ఛందంగా అమలు చేశారు.

వలలు, బోట్లు సిద్ధం

వేట నిషేధం కావడంతో సురక్షిత ప్రాంతాల్లో ఉంచిన వలలు, ఉప్పుటేర్లలో లంగరు వేసిన బోట్లను సోమవారం మత్సకారులు సముద్ర తీరానికి చేర్చారు. కొత్తగా తయారు చేసిన బోట్లను సైతం పొక్లెయిన్ సాయంతో తీసుకువచ్చి సముద్రంలో లంగరు వేశారు. బోట్లలో డీజిల్, వంట, వేట సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. గత 45 రోజులుగా ఖాళీగా ఉన్న మత్సకారులు ఈ సమయంలో బోట్లు, వలలకు మరమ్మతులు చేసుకున్నారు. వేట నిషేధం ముగుస్తుండటంతో చేపల వ్యాపారులు సైతం తమ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరో మూడు రోజుల్లో సాగర తీరం చేపల వేట, క్రయ విక్రయాలతో మళ్లీ కళకళలాడనుంది.

మంచినీటి ప్రాజెక్టు పరిశీలన



కరపలోని రక్షిత మంచినీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

కరప: మండల కేంద్రమైన కరపతో పాటు, శివారు గ్రామమైన పేపకాయలపాలెం తదితర ప్రాంతాల్లో తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.శ్రీదేవి, ఏఈఈ వీవీఎస్ వర్ధన్ ఆయా గ్రామాల్లో సోమవారం పర్యటించారు. మంచినీటి పైపులైన్లను, కరపలోని సామూహిక రక్షిత మంచినీటి సరఫరా ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్థానికులతో అధికారులు సమావేశమై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మంచినీటి పైపులైన్‌లో మట్టిపేరుకు పోవడం వల్ల కుళాయిలకు మంచినీటి సరఫరా చేసిన వెంటనే కొద్దిసేపటి వరకూ బురద నీరు వస్తోందని, పైపులైన్‌ను శుభ్రం చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. రక్షిత మంచినీటి చెరువు నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతనే గ్రామాలకు సరఫరా చేస్తామన్నారు. కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో అనధికార కుళాయిలు ఉన్నాయని, శివారు ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు అందాలంటే వాటిని తొలగించాల్సి ఉందని డీఈఈ శ్రీదేవి, ఏఈఈ వర్ధన్ స్పష్టం చేశారు.

అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యత్వానికి భామిరెడ్డి రాజీనామా

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యత్వానికి కర్రి భామిరెడ్డి (కాకినాడ) సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయన రాజీనామా చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, ఏడుగురు మహిళలతో సహా 15 మంది సభ్యులను 2023 మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరి పదవీ కాలం 2025 మార్చి వరకూ ఉంది.

కొలిక్కొస్తే చాలు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో నిర్మించిన బీటీ రోడ్డు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్

- పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు
- రమణయ్యపేట, సర్పవరంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- తప్పనున్న ముంపు సమస్య

కాకినాడ రూరల్: పారిశ్రామికాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) ద్వారా ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడల్లో(ఎస్టేట్స్)లో బృహత్తర మౌలిక సదుపాయాలు కల్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీతో పాటు, సర్పవరంలోని ఏపీఐఐసీ కాలనీ ఆటోనగర్‌లో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు రెండు నెలలుగా చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న వర్షా కాలంలో దాదాపు సమస్యలన్నీ ఓ కొలిక్కి రానున్నాయి. వర్షాకాలంలో సర్పవరం ఆటోనగర్‌లో పొలాల్లోని నీరు ప్రవేశించి, చాలాసేపటి వరకూ పారడం లేదు. బయటకు పోయేందుకు ఎక్కువ సమయం పడతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రోడ్లు పాడవ్వడంతో పాటు, వర్షాకాలంలో నీరు రోడ్లపై నిలిచిపోయేది. దీంతో స్థానికంగా పరిశ్రమలు నిర్వహించే వారు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో రెండు చోట్లా రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. సర్పవరం, రమణయ్యపేటలో ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) నిధులు రూ.1.10 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పన కోసం అభివృద్ధి పనులు చేపట్టారు. సర్పవరం ఆటోనగర్‌లో ప్రధాన మార్గంలో సుమారు 150 మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం రూ.39 లక్షలతో చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే.. ఇక్కడ ప్రయాణించే వారికి గతుకుల సమస్య తప్పుతుంది. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రెండు వర్కులుగా విభజించి పనులు చేపడుతున్నారు. సుమారు రూ.70 లక్షల నిధులతో 490 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. వీటిలో ఏపీఐఐసీ కాలనీ నుంచి ఎల్ ఆకారంలో సెవెన్ స్కా హోటల్ వరకూ 150 మీటర్ల మేర బీటీ రోడ్డు, క్రాస్ రోడ్డు 8 వద్ద సిమెంట్ రోడ్డుతో పాటు, డ్రైనేజి నిర్మాణం చేపట్టారు., వీటి నిర్మాణం పూర్తయితే ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వారితో పాటు, స్థానికులకూ ఇబ్బందులు తప్పనున్నాయి.

మిగిలిన రోడ్లూ పూర్తయితే..

సర్పవరం, రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో ఐలా నిధులతో రెండు నెలల క్రితం మౌలిక సదుపాయలు కల్పన దిశగా రోడ్ల నిర్మాణం చేపట్టారు. రెండు చోట్లా చాలా రోడ్లు ఇంకా నిర్మించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితే బాగుంటుందని పారిశ్రాకమిక వేత్తలు చెబుతున్నారు.

> **చాలా వరకూ పూర్తి**
>
> సర్పవరం, రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. రమణయ్యపేటలో రోడ్ల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. సర్పవరం ఆటోనగర్‌లో మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఐలా సహకారంతో ప్రభుత్వం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పన దిశగా చర్యలు తీసుకుంటాం.
>
> – ఎ.రమణారెడ్డి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



గోకవరంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఎండీకేఏ స్పీపీ షినస్స్ లే అవుట్‌లో సోమవారం కాకినాడకు చెందిన శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు సుమారు 100 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఈ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు, పలు ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇదే స్ఫూర్తితో తాను త్వరలో బీజేపీలో చేరనున్నట్టు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టర్ స్వరూపారాణి, సిబ్బంది రమాసత్యనారాయణ, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సతీష్

జగ్గంపేట: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కె.సతీష్ కోరారు. జగ్గంపేటలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు ప్రారంభించాయన్నారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సంవత్సరానికి అన్ని రకాల ఫీజులు కలిపి రూ.24 వేలు మించకూడదని ప్రభుత్వ నిబంధన ఉన్నా, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దీనిని పట్టించుకోవడం లేదన్నారు. డొనేషన్లు, కాంపిటీషన్ల పేరుతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరారు. గుర్తింపు లేని విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు రాము, అర్జున్, సురేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.